క్లుప్తంగా

పాఠశాలలకు ట్యాబ్‌ల అందజేత



ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంఈవో

నగరి : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను సోమవారం ఎంఈవోలు పీఎస్ శ్రీదేవి, బి.నమశ్శివాయం పాఠశాలలకు పంపిణీ చేశారు. ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేసి సద్వినియోగం చేసుకునేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

చురుగ్గా రోడ్డు పనులు



నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకేఎస్ లేఅవుట్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.15 లక్షల వ్యయంతో నిర్మించే ఈ రోడ్డుకు మంత్రి ఆర్కేరోజా ఇటీవల భూమిపూజ చేశారు. సోమవారం ఎర్రమట్టి తోలి రోడ్డు లెవలింగ్ పనులు చేపట్టారు. కౌన్సిలర్లు దయానిధి, మునికృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎల్లప్పరెడ్డి పనులను పర్యవేక్షించారు.

ఘనంగా ధనుర్మాస భజనలు



నగరి : పట్టణానికి చెందిన గోవిందమాల భక్తులు ధనుర్మాస భజనలు చేస్తున్నారు. వేకువ జామునే ఆలయంలో దీపారాధన చేసి మాడవీధుల్లో గోవింద నామ సంకీర్తనలను ఆలపిస్తున్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో గోవింద భజనలు చేస్తున్నారు. ప్రతి ఏటా ధనుర్మాసంలో ఇలా పూజలు చేస్తున్నట్లు గురుగోవింద బాలాజీ తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో వడమాలపేట విద్యార్థి ప్రతిభ



జయసూర్యను అభినందిస్తున్న పీడీ చంద్రశేఖర్‌రాజు

పుత్తూరు: విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో ఈ నెల 11 నుంచి 13 వరకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో వడమాలపేటకు చెందిన విద్యార్థి సి.జయసూర్య కాంస్య పతకాన్ని కై వసం చేసుకున్నాడు. వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జయసూర్య ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున 48 కిలోల విభాగంలో సత్తా చాటి పతకం సాధించాడు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం కరుణానవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు అభినందించారు.

నేడు పుత్తూరులో విద్యుత్ అదాలత్

పుత్తూరు: పట్టణంలోని విద్యుత్ డివిజన్ ఇంజినీర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11–30 నుంచి మధ్యాహ్నం 1–30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.చిన్నరెడ్డప్ప తెలిపారు. పుత్తూరు డివిజన్ పరిధిలోని పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం, నగరి, విజయపురం, నింద్ర, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను విద్యుత్ అదాలత్‌లో రాతపూర్వకంగా తెలియజేయవచ్చని తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన శేఖర్

కార్వేటినగరం: చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని పద్మసరస్సు సమీపంలో సోమవారం టాటా ఏస్ వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కార్వేటినగరం కోటదళితవాడకు చెందిన శేఖర్(32) సొంత పనుల నిమిత్తం పద్మ సరస్సుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఈ క్రమంలో పుత్తూరు నుంచి వెళుతున్న టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దస్తగిరి తెలిపారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- అన్ని పరిస్థితుల్లోను ప్రజలకు అందుబాటులో ఉన్నాం
- విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత
- నమ్మించి మోసం చేయడంలో దిట్ట చంద్రబాబు
- గడపగడపకూ మన ప్రభుత్వంలో మంత్రి ఆర్కే రోజా



సంక్షేమ బుక్‌లెట్స్ అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖల మంత్రి ఆర్కేరోజా తెలిపారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట 12, 13వ వార్డు ల్లో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమెకు స్థానికులు హారతి పట్టి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ వార్డుల్లోని ఉన్నత పాఠశాల ఆధునికీకరణకు రూ.66 లక్షలు వెచ్చించామన్నారు. రూ.1.25 కోట్లతో 12 గదులు, రెండు అంతస్తులతో నూతన పాఠశాల భవనం మంజూరైందని, స్థల సేకరణ కూడా పూర్తయిందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితులు, తుపాను బీభత్సంలోను ప్రజలకు అండగా నిలిచామన్నారు. ప్రజలతో మమేకమై వారి అవసరాలు తీరుస్తున్నామని వివరించారు. ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని, మంచి చేసిన ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలన్నారు. చంద్రబాబు నమ్మించి మోసం చేయడంలో దిట్టని విమర్శించా రు. 2014లో అధికారం కోసం చంద్రబాబు డ్వాక్రా రైతు రుణాలను మాఫీ చేస్తానని, బ్యాంక్‌లో పెట్టిన బంగారాన్ని విడిపించి ఇస్తానని నమ్మబలికి నిట్టనిలువునా ముంచాడని ఆరోపించారు. దీంతో 30 లక్షల మంది పొదుపు మహిళలు బ్యాంకుల దృష్టి లో డిఫాల్టర్లుగా మారారని తెలిపారు. చివరికి వారు ఆస్తులు అమ్ముకుని రుణాలు చెల్లించారని గు ర్తు చేశారు. చంద్రబాబు మాటలను నమ్మి మరోసారి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుత పాలనలో స్థానిక సచివాలయ పరిధిలోనే 892 మందికి సున్నా వడ్డీ రుణాలు రూ.38.56 లక్షలు అందజేశామని చెప్పారు. వైఎస్సార్ ఆసరా కింద 714 మందికి రూ.2.40 కోట్లు అందించామన్నారు. చేయూత ద్వారా 384 మందికి రూ.1.55 కోట్లు అందిస్తున్నామన్నారు. చేసిన మేలును అంకెలతో సహా వివరిస్తూ ఇంటింటికీ సాక్ష్యాలతో సహా తెలియజేస్తున్న జగనన్న పాలనను కొనసాగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు చిత్ర, ఎంఎం కామాక్షి, మోహన్‌రాజ్, భూపాలన్, ఇంద్రయ్య, నాయకులు మనోహర్, ఇళంగో, సతీష్, జానకిరామ్, రమేష్‌బాబు, మున్సిపల్, ట్రాన్స్‌కో, హౌసింగ్, ఐకేపీ, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.2 లక్షల సీఎం సహాయ నిధి



విద్యార్థికి ఎల్‌వోసీని అందజేస్తున్న మంత్రి రోజా

నగరి : విజయపురం మండలం ఎం.అగరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.బాలకృష్ణ నాయుడు కుమారుడు 10వ తరగతి చదువుతున్న పి.యోగికుమార్‌కు వినికిడి యంత్రం కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.రెండు లక్షలు మంజూరైంది. విద్యార్థికి వినికిడి సమస్య తీవ్రంగా ఉండడంతో సర్జరీ ద్వారా వినికిడి యంత్రం అమర్చాలని వైద్యులు సూచించారు. ఇందుకు లక్షల్లో ఖర్చవుతుందన్నారు. దీంతో బాలకృష్ణమ నాయుడు మంత్రి ఆర్కేరోజాను సంప్రదించి విద్యార్థి పరిస్థితిని వివరించి సాయం చేయాలని కోరారు. ఆమె విద్యార్థి పరిస్థితిని సీఎం సహాయనిధి విభాగానికి వివరించి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. సోమవారం తన నివాసంలో విద్యార్థికి నిధులకు సంబంధిత ఎల్‌వోసీని అందజేశారు. సర్జరీ చేయించుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. అడిగిన వెంటనే సాయం అందించిన మంత్రికి బాలకృష్ణమ నాయుడు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చెన్నైలోని కేకేఆర్ ఈఎన్‌టీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సర్జరీ ద్వారా విద్యార్థికి వినికిడి యంత్రాన్ని అమర్చనున్నారు.

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం



గోపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో, సంఘం సభ్యులు

నగరి : పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయచంద్రుడు, కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం పెన్షనర్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. నగరి, ఇందులో ముఖ్య అతిథిగా ఉప ఖజానా అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్లు తీసివ్వడంలోను, పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారంలో పెన్షనర్ల సంఘం ఎంతో కృషి చేస్తోందని కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, నగరి పెన్షనర్ సంఘం వ్యవస్థాపకుడు బి.భాస్కరన్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు భవనాన్ని నిర్మించుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణ స్థలదాత సరస్వతి నిర్మల రాజగోపాల రాజు మాట్లాడుతూ విరమణ పొందిన ఉద్యోగులు సమాజసేవలో ముందుండడం సంతోషంగా ఉందన్నారు. పదవీ విరమణచేసి 15 ఏళ్లు నిండిన ఏఎస్ శ్రీనివాసన్, ఎ.మోహన్, పి.గోపాల్‌రెడ్డి, వి.కుమరేశన్, ఎ.రాజేంద్రన్, ఓ.ధనుంజయులు, డి.సుబ్రమణ్యం, ఎస్.దొరైరాజ్, జి.నీలకంతుడు, ఎం.జయపాల్‌రెడ్డి, ఏజీ ఉమాశంకర్, కె.నాగమణి, ఎ.వరలక్ష్మమ్మ, డి.రామమూర్తి, ఎ.రామమూర్తి, టివి ప్రభావతిని సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రన్, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి, అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు చెంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గురురాజారావు, నగరి ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, విజయపురం ఎంఈవో హరిప్రసాద్ వర్మ, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు ఎంఏ జయరామన్, జనార్ధన్, డీఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అరుణగిరిపై ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై వెలసిన జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునే సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కై ంకర్యాలు చేపట్టారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన




శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున వరదరాజస్వామి ఆలయానికి భక్తులు తరలివస్తారని చెప్పారు. భక్తుల తాకిడికి తగినట్లు పటిష్టమైన క్యూలు ఏర్పాటు చేయాలన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



ఆరోగ్యశ్రీ పరిధి పెంపు కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

గంగాధర నెల్లూరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ అనిత తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వైద్య పరీక్షలకు మంజూరు చేసే నిధులను రూ.25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని వీక్షించారు. ఎంపీపీ అనిత మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్న రోగి పూర్తిగా కోలుకుని తిరిగి పనులకు వెళ్లే వరకు రోజుకు రూ.225, నెలకు రూ.5000 అందజేస్తున్నట్టు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్న ప్రభుత్వాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.





బలికంద్రిగలో ఏర్పాటుచేసిన స్టార్లు

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు

పాలసముద్రం : మండలంలోని క్రిస్మస్ పండుగ సందడి నెలకొంది. క్రైస్తవులు చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. ఇళ్ల ముందు స్టార్లను ఏర్పాటు చేశారు. సోమవారం ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు చేశారు. కొంతమంది విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణతో ఆకట్టుకున్నారు.



భజన చేస్తున్న క్రైస్తవులు

బంగారమ్మకు వెండి పాదుకల వితరణ



ఆలయ నిర్వాహకులకు వెండి పాదుకలు అందజేస్తున్న దాతలు



విచిత్ర వేషధారణలో విశ్రాంత ఉద్యోగులు

కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటినగరంలో వెలసిన బంగారమ్మ ఆలయానికి సోమవారం పోస్టాఫీసు గోపాల్ కుటుంబ సభ్యులు రూ.78 వేలు విలువైన వెండి పాదుకలు ఎంపీపీ లత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో ఆలయ అధ్యక్షుడు కే.ప్రసాద్‌కు అందజేశారు. ఆలయ అధ్యక్షుడు మాట్లాడుతూ బంగారమ్మ జాతరలో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించి కానుకలు సమర్పిస్తున్నారని తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దాత కుటుంబ సభ్యులు భాస్కర్, సాయి, స్థానిక సర్పంచ్ ధనుంజయ వర్మ, ఆలయ ఉపాధ్యక్షుడు రంగనాథమొదలి, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

బంగారమ్మ జాతరను పురస్కరించుకుని భక్తులు వివిధ వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. గ్రామంలో తిరుగుతూ నృత్యం చేశారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని బంగారమ్మకు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

చేసిన మేలును గుర్తించి ఆదరించండి



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గంగాధర నెల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన మేలును గుర్తించుకుని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని అగర మంగళం సర్పంచ్ సుగుణమ్మ కోరారు. ఆమె సోమవారం ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజుతో కలిసి స్థానిక గ్రామ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అలాంటి సీఎం ఉంటేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. అగరమంగళం గ్రామ పంచాయతీ అభివృద్ధి, పథకాలు తదితరాలతో సీఎం జగనన్న దాదాపు రూ.20 కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీఎం వెంకటేశులుశెట్టి, నాయకులు కేశవులు రెడ్డి, గోవింద శెట్టి, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ సమస్య పరిష్కారం



సిమెంట్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న అన్బలగన్, అయ్యప్ప

పాలసముద్రం : మండల కేంద్రమైన పాలసముద్రం దళితవాడలో మురుగు కాలువ సమస్యను జెడ్పీటీసీ అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప పరిష్కరించారు. వారు మాట్లాడుతూ దళితవాడలో కాలువ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల మధ్యనే నిలుస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఆయన రూ.15 లక్షలు గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు మంజూరుచేయించారని తెలిపారు. ఈ క్రమంలో మురుగు నీరు నిలువకుండా సిమెంట్ పైపులు వేసి సమీపంలో ఉన్న కావలువలోకి చేరేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో ప్రజలు డిప్యూటీ సీఎం నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది

పుత్తూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని నగరి ఆర్డీవో సుజన తెలిపారు. పుత్తూరు పట్టణంలో సోమవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా బాబు



పుత్తూరు: దక్షిణ రైల్వే స్టేషన్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా పుత్తూరుకు చెందిన బీజేపీ నాయకుడు కె.బాబును నియమిస్తూ చెన్నై డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ జె.శ్రీవిద్య ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు ఉంటారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో స్థానిక ప్రజల తరపున భాగస్వామిగా వ్యవహరిస్తారు.

భక్తిప్రపత్తులతో ఆరాధనోత్సవాలు



త్యాగరాజు, పురంధర దాసు, ముత్తుస్వామి దీక్షితుల చిత్రపటాలను ఊరేగిస్తున్న నాయీ బ్రాహ్మణులు

పిచ్చాటూరు: పిచ్చాటూరులో సోమవారం భక్తిప్రపత్తులతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు జి.నాగరాజు మాట్లాడుతూ, ధనుర్మాసంలో ప్రతి ఏటా శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. ఉదయం స్థానిక మలయపెరుమాళ్ ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేక పూజల అనంతరం త్యాగరాజు, పురంధరదాసు, ముత్తుస్వామి దీక్షితుల చిత్రపటానికి ఆలయంలో పూజలు చేసి ఊరేగించారు. సాయంత్రం స్థానికంగా ఉన్న ఎంకేటీ కళ్యాణ మండపంలో మంగళంపాడు ఎస్.శివ, ఏ.కార్తిక్, ఎస్.ఆర్ కణ్ణన్, ఆనంద్ నాదస్వర కచేరి, పి.దశరథ, వేణుగోపాల్, గణపతి, గణేష్ తదితరులు డోలు కచేరి నిర్వహించారు. పలు త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ డి.ఇళంగోవన్ రెడ్డి అన్నదానం చేశారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

- మంత్రి ఆర్కే రోజా
- సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: జగనన్న ప్రభుత్వం ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖల మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆమె సోమవారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీ 16వ వార్డులో పలుచోట్ల సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నగరం రోడ్డు నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు, ఎన్జీఓ కాలనీలోనూ సీసీ రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారులు అభివృద్ధికి చిహ్నాలని పేర్కొన్నారు. నేటి జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగుతోందని తెలిపారు. మన రాష్ట్రం దేశానికికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. మన ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వారి మాటలను నమ్మే పరిస్థితి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లోనూ విజయం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించబోతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌వో దిలీప్, మైనారిటీ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు వనిత, హేమలత, జయలక్ష్మి, భానుమతి, షకీలా, జాన్‌కెనడీ, చిట్టిబాబు, ఏకాంబరం, ఆలయ కమిటీ చైర్మన్లు లారీ మోహన్, మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, సింగిల్ విండో ప్రెసిడెంట్లు శ్రీనివాసులురెడ్డి, నారాయణ రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్ యోగానందం, మున్సిపల్ ఏఈలు హేమశేఖర్‌రెడ్డి, కార్తికేయన్ పాల్గొన్నారు.